## క్లుప్తంగా

### వివిధ హక్కుల కోసం బహిరంగ వేలం

**పాకాల:** స్థానిక ఆనందగిరి కొండపై వెలసిన శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యాస్వామి ఆలయంలో ఆగస్టు 10వ తేదీ నుంచి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భక్తుల సమర్పించే తలనీలాల సేకరణ, వాహనాల పార్కింగ్, పాద రక్షల భద్రపరచుకోవడం, కొబ్బరి చిప్పలు సేకరించేందుకు ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తలనీలాలకు రూ.10,000, వాహన పార్కింగ్, చెప్పులు భద్రపరుచుట, కొబ్బరి చిప్పలు సేకరించేందుకు రూ.1000 చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

### ఆకట్టుకున్న లవకుశ నాటకం


లవకుశ నాటకంలోని సన్నివేశం

**చంద్రగిరి(తిరుపతి రూరల్):** చంద్రగిరిలో వెలసిన కోదండ రామస్వామి ఆలయం వద్ద ఆదివారం సుబ్బరాజు నాటిక కళాపరిషత్ కళాకారులు ప్రదర్శించిన లవకుశ నాటకం పలువురిని అలరించింది. అంతఃపురంలో శ్రీరామచంద్రుడు, అడవిలో సీతాదేవి పడిన కష్టాలను అద్భుతంగా అభినయించారు. వాల్మీకి మహర్షి లవకుశలకు చేసిన అక్షరాభ్యాసం, అనంతరం లక్ష్మణ, శ్రీరామచంద్రుడితో లవకుశలు యుద్ధ ఘట్టాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ రూప ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, శంకర్ రెడ్డి, చేగు లక్ష్మీనారాయణ గుప్త, రామ్మూర్తి పాల్గొన్నారు.

### వేడుకగా అంకాలమ్మ జాతర


అమ్మవారి సేవలో అంజూరు తారక శ్రీనివాసులు

**శ్రీకాళహస్తి:** పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన శ్రీఅంకాలమ్మ అమ్మవారికి ఆదివారం జాతర నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కమిటీ సభ్యులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో స్వర్ణమూర్తి, హరినాథ్‌నాయుడు, ఫాజల్, యతిరాజులు, బాలగౌడ్, అంకాలమ్మ కమిటీ సభ్యులు గోవర్ధన్, మురళి పాల్గొన్నారు.

### పచ్చాలమ్మకు ప్రత్యేక పూజలు



**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని పల్లమాల పంచాయతీ పచ్చాలమ్మ కాలనీలో వెలసిన పచ్చాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

### తిరుమలేశుని సేవలో దేవప్రసాద్‌దాస్ స్వామి



**శ్రీకాళహస్తి:** తిరుమల శ్రీవారిని ఆదివారం శ్రీస్వామి నారాయణ గురుకుల్ ట్రస్టు ఇంటర్నేషనల్ ప్రధాన స్వామిజీ మహంతు సాధు దేవ ప్రసాద్ దాసు స్వామి, శిష్య బృందంతో కలిసి దర్శించుకున్నారు. ట్రస్టు నిర్వాహకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి, పులివెందుల, విశాఖపట్టణంలో తమ ఇంటర్నేషనల్ పాఠశాలల ఏర్పాటుకు స్థలాలకు సంబంధించి జీఓలను విడుదల చేశారన్నారు. త్వరలోనే సీఎం చేతుల మీదుగా పనులు ప్రారంభిస్తామన్నారు. వారితో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

# ఆధ్యాత్మిక నగరిలో అభివృద్ధి పరుగులు


ఉపాధ్యాయ నగర్‌లో వేసిన ఇంటర్నల్ రోడ్డు


తిరుమలనంబి మార్గము

- మాస్టర్ ప్లాన్ రోడ్లతో భవిష్యత్తుకు బాటలు
- ఏడాదిలోనే ఉపాధ్యాయ నగర్‌కు మోక్షం

**తిరుపతి తుడా:** తిరుమల శ్రీవారి దర్శనం కోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు నిరంతరం వేలాది తరలివస్తుంటారు. సరైన రోడ్ల వ్యవస్థ లేకపోవడం, నగరానికి ఇతర ప్రాంతాల నుంచి కనెక్టివిటీ లేకపోవడం శాపంగా మారింది. ఈ కారణంగానే తిరుపతి నడిబడ్డుగా భావించే ఆర్టీసీ బస్టాండ్‌కు 100 మీటర్ల తూర్పు వైపు నుంచి అభివృద్ధి చెందలేదు. ఈ లోపాలను అధిగమించాలని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి భావించారు. తిరుపతికి కనెక్టివిటీ పెంచడంతోపాటు మరో 5 వేల ఎకరాల్లో నగరం విస్తరించేలా 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. అలాగే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడిని అధిగమించేందుకు ఏడు ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్టలు, మరిన్ని ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, ఇంటర్నల్ రోడ్ల అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు.

**ఉపాధ్యాయ నగర్‌కు మోక్షం**

ప్రముఖులు, వైద్యులు, ప్రొఫెసర్లు తదితర ఉన్నత శ్రేణి వ్యక్తులు పెద్ద సంఖ్యలో నివసిస్తున్న ఉపాధ్యాయ నగర్ దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదు. సుమారు 50 ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రాంతంలో ఏడాది క్రితం వరకు చిన్నపాటి సీసీ రోడ్డు కూడా ఉండేది కాదు. ఇప్పుడు ఆ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. తారు రోడ్డుతో పాటు ప్రతి వీధికి అండర్ డ్రైనేజీ సిస్టం, సీసీ రోడ్లు, ప్రతి ఇంటికీ యుడీసీ, వాటర్ కనెక్షన్లు అందించారు.

**రూ.10.50 కోట్లతో అభివృద్ధి**

ఉపాధ్యాయ నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన సూచనలతో నగర మేయర్ శిరీష అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉపాధ్యాయ నగర్ అభివృద్ధి కోసం మున్సిపల్ కార్పొరేషన్ రూ.10.50 కోట్లను ఖర్చు చేసింది. మెయిన్ రోడ్డు 1.5 కిలో మీటర్ల మేర తారు రోడ్డు వేశారు. 9 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లను ఏర్పాటు చేశారు. తొమ్మిది కిలోమీటర్లు యుడీసీ, వాటర్ లైన్ సౌకర్యాలను కల్పించారు.

**కార్పొరేషన్‌కు ఆదాయ వనరుగా...**

ఉపాధ్యాయ నగర్‌లో ఆధునిక సౌకర్యాలు, రోడ్ల అభివృద్ధితో కార్పొరేషన్‌కు కోట్లలో ఆదాయం సమకూరుతోంది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌తో ఆ ప్రాంతంలో మరిన్ని నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే భవన నిర్మాణ అప్రూవల్ ద్వారా కార్పొరేషన్‌కు సుమారు రూ.7 కోట్లకు పైగా ఆదాయం లభించినట్లు అధికారులు అంచనా వేశారు. దీంతోపాటు యుడీసీ, వాటర్ కనెక్షన్ల ద్వారా రూ.50 లక్షలకు పైగా ఖజానాకు చేరింది. వసతులు పెరగడంతో 50 శాతానికి పైగా ఖాళీగా ఉన్న స్థలాల్లో భవన నిర్మాణాలు చకాచకా జరుగుతున్నాయి. అదేవిధంగా భవన నిర్మాణ అనుమతుల ద్వారా మరో రూ.6 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అలానే ఇటీవల తిరుపతి తూర్పు ప్రాంతంలో అభివృద్ధి చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లతో ఆ ప్రాంతాల్లోనూ భవన నిర్మాణాలకు అడుగులు పడుతున్నాయి. భవన అనుమతుల కోసం లక్షలాది రూపాయలు కార్పొరేషన్ ఖజానాకు చేరుతోంది. రోడ్ల అభివృద్ధి కోసం చేసిన ఖర్చు జమ కావడంతోపాటు అనతి కాలంలోనే రెట్టింపు ఆదాయం అందనుంది. పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందితే మరో ఐదేళ్ల నుంచి ప్రతి ఏటా ఆ ప్రాంతం నుంచి మూడు కోట్ల మేర వివిధ పన్నుల రూపంలో కార్పొరేషన్‌కు ఆదాయం అందనుంది.

**స్థానికుల హర్షం**

నగరంలో ఉద్యమంలా చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్లపై తిరుపతి వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో 50 ఏళ్ల అవసరాలే లక్ష్యంగా చేపట్టిన పనులను ఆసక్తిగా గమనిస్తున్నారు. నగరాన్ని విస్తరించడం, ప్రస్తుతం రద్దీగా ఉన్న ప్రాంతాలపై ఒత్తిడి తగ్గించడమే ప్రధాన అజెండాగా మాస్టర్ ప్లాన్ రోడ్లను ప్రతిపాదించిన డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి ముందుచూపును అభినందిస్తున్నారు. 18 మాస్టర్ ప్లాన్ రోడ్లలో ఇప్పటికే ఎనిమిది రోడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. అలానే నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఏడు ఫ్రీ లెఫ్టలతోపాటు 40 ఏళ్లుగా సహకారం కాని కొర్లగుంట, గంగమ్మ గుడి మాస్టర్ రోడ్లను సైతం సుసాధ్యం చేశారు.

**తిరుమలనంబి మార్గంగా నామకరణం**

ఉపాధ్యాయ నగర్ మెయిన్ రోడ్డుకు తిరుమల నంబి పేరును ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ప్రతిపాదించారు. ఆ మేరకు కౌన్సిల్‌లో ఆ రోడ్డుకు తిరుమల నంబి పేరును ఖరారు చేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. నాలుగైదు రోజుల్లో ఈ మార్గాన్ని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆవిష్కరించనున్నారు.

**భవిష్యత్తు చెప్పుకునేలా అభివృద్ధి**



తిరుపతి నగరానికి ఎంతో ఘన చరిత్ర ఉంది. తిరుపతికి ఉన్న పేరు విస్తరిస్తున్నా నగరం మాత్రం కొంత ప్రాంతంలోనే కుచించుకుపోయింది. ఇందుకు సరైన రోడ్ల వ్యవస్థ లేకపోవడమే కారణమని గుర్తించాము. 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. అలానే నగరంలోని అన్ని ఇంటర్నల్ రోడ్లను అభివృద్ధి చేసి తీరుతాం. భవిష్యత్తులో చెప్పుకునేలా నగర అభివృద్ధి ఉండబోతోంది.

– భూమన అభినయ్ రెడ్డి, డిప్యూటీ మేయర్, తిరుపతి

**ఉపాధ్యాయ నగర్ దశ మారింది**



ఈ ప్రాంత అభివృద్ధి కోసం రూ.10.50 కోట్లు ఖర్చు చేశాం. తిరుమలనంబి మార్గం మాస్టర్ ప్లాన్ రోడ్డుతో పాటు ఇంటర్నల్ రోడ్ల అభివృద్ధిని నగర ప్రజలకు అంకితం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. మరో నాలుగు ఐదు రోజుల్లో ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు ఉంటాయి.

– డి.హరిత, కమిషనర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్

# అలరించిన కూచిపూడి నృత్యం



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు



**తిరుచానూరు(చంద్రగిరి):** వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో తిరుపతికి చెందిన కొండా రవి ఆధ్వర్యంలో కళాకారులు చేపట్టిన కూచిపూడి, జానపద నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. కళాకారులు శ్రీనయన, యశస్విణి, తేజోమయి, కుషల, షణ్ముఖ, శాన్వి, మేహన, సహస్ర, హస్విక, బిబిత, శ్రీనయన పాటలకు అనుగుణంగా అభినయంతో ఆకట్టుకున్నారు. వారిని ఏఓ ఖాదర్‌వలి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## దంత పరిరక్షణతో ఆరోగ్యం


దంత పరీక్షలు చేస్తున్న సాయి సందీప్ డెంటల్ ఆసుపత్రి వైద్యులు

**తిరుపతి కల్చరల్:** ప్రతి ఒక్కరూ దంతాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని ప్రముఖ దంత వైద్య నిపుణుడు డాక్టర్ సందీప్ నరహరి తెలిపారు. బైరాగిపట్టెడలోని బాబూ జగ్జీవన్‌రామ్ పార్క్‌లో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయి సందీప్ డెంటల్ కేర్ హాస్పిటల్ వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ సందీప్‌నరహరి మాట్లాడుతూ షుగర్ వ్యాధిగ్రస్తులు పళ్లను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. పళ్ల మధ్య ఆహారం ఇరుక్కోకుండా చూసుకోవాలని, ప్రతి మూడు నెలలకొకసారి బ్రష్ మార్చాలని సూచించారు. పడుకునేముందు తీపి పదార్థాలను తినవద్దన్నారు. వాకర్స్ అసోసియేషన్ కార్డు కలిగిన వారికి తమ ఆసుపత్రిలో కన్సల్టేషన్ ఫీజు లేకుండా బిల్లులో 15 శాతం రాయితీ ఇస్తామన్నారు. కార్యక్రమంలో బాబూ జగ్జీవన్‌రామ్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.రాజారెడ్డి, కార్యదర్శి ఆనంద్ రాజు, నాయకులు వెంకటరమణరెడ్డి, వేణు రాయల్, జమాల్ వల్లి, కుమార్‌స్వామి నాయుడు, మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.బాలసుబ్రమణ్యం, ఆధార్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ రఫీ, డాక్టర్ యామిని సాయి ప్రియ, సుధీర్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న రాజస్థాన్ అసోసియేషన్ ప్రతినిధులు

**తిరుపతి కల్చరల్:** రాజస్థాన్ కాస్మో క్లబ్ సామాజిక బాధ్యత చారిటీ వర్క్స్, రాజస్థాన్ యూత్ అసోసియేషన్ సంయుక్తంగా ఆదివారం రుయా ఆసుపత్రి వద్ద సుమారు 700 మంది పేదలకు అన్నదానం చేశారు. రాజస్థాన్ యువత తమ సొంత ఖర్చులతో ప్రతినెలా పౌర్ణమి నాడు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా రుయా ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా చారిటీ వర్క్స్ ప్రతినిధి నవరతన్ జైన్ మాట్లాడుతూ రాజస్థాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ ఆరాధ్య దైవం మహవీర్ జైన్‌ను స్మరిస్తూ ప్రతి పౌర్ణమి నాడు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రతి నెలా రెండో ఆదివారం నిరుపేదలకు కంటి వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేయిస్తున్నామని పేర్కొన్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన పేదలు కొత్త వీధిలోని జైన్ ప్రార్థనా మందిరం, లేదా 8008629700లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు, చారిటీ వర్క్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ కమిషనర్

**తిరుపతి తుడా:** తిరుపతి నగర ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు కమిషనర్ హరిత తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి 10:30 వరకు ప్రజలు 0877–2227208కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. అలాగే ఉదయం 10:30 నుంచి నేరుగా అధికారులకు ఫిర్యాదులు అందజేయవచ్చని వెల్లడించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**ఏర్పేడు:** మండలంలోని సీతారాంపేట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. తిరుపతికి చెందిన సుబ్రమణ్యం (49), మునస్వామి(36) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా సీతారాంపేట సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# మేనమామ సాంగ్యం బహూకరణ



**రేణిగుంట:** రేణిగుంట బుగ్గవీధిలో ముస్లిం వధువుకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అందజేసిన మేనమామ సాంగ్యాన్ని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి ఆదివారం అందజేశారు. రేణిగుంట షాదీమహల్‌లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్న ఆమె వధువుకు మేనమామ సాంగ్యంగా డబుల్‌కాట్ మంచం, బెడ్, బీరువాను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నగేషం, వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీటీసీ సభ్యుడు ఫైజున్నీసా బేగం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, పట్టణ ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, షాదీమహల్ డైరెక్టర్ మస్తాన్, మాబా తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 7న తిరుపతిలో ఓబీసీ జాతీయ మహాసభ


మాట్లాడుతున్న మార్గాని మధు ఆచారి

**తిరుపతి కల్చరల్:** తిరుపతిలో ఆగస్టు 7వ తేదీన ఓబీసీ జాతీయ మహాసభ నిర్వహించనున్నట్లు ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జయచంద్ర, ఉపాధ్యక్షుడు మార్గాని మధు ఆచారి తెలిపారు. వారు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అధ్యక్షన జరిగే ఈ మహా సభకు దేశ వ్యాప్తంగా నలుగురు ముఖ్యమంత్రులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదంతో పాటు, ఓబీసీల ప్రధాన సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నాగేంద్ర, సుబ్రమణ్యం, జగదీష్, వాసు పాల్గొన్నారు.

## ఎఫ్‌వోబీఎంఐఎస్ చైర్మన్‌గా శేషగిరిరావు


ఎమ్మెల్యే మల్లాది విష్ణును సత్కరిస్తున్న ఎఫ్‌వోబీఎంఐఎస్ నూతన కమిటీ ప్రతినిధులు

**తిరుపతి కల్చరల్:** అఖిల భారత బ్రాహ్మణ కల్యాణోపాధ్యాయ వివాహ సమాచార కేంద్రాల సంఘం చైర్మన్‌గా తిరుపతికి చెందిన సీఆర్‌కే.శేషగిరిరావు రెండో సారి ఎన్నికయ్యారు. సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం విజయవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎం.కిరణ్‌కుమార్, అసోసియేట్ చైర్మన్‌గా దైతా రామ్మూర్తి, వైస్ చైర్మన్లుగా జయంతి ప్రకాష్, వైవీ.సూర్యనారాయణ, ఊటుకూరు పార్థసారథి, కోశాధికారిగా ఎంఆర్‌ఎల్.రావు, సహాయ కార్యదర్శులుగా కె.రాఘవ, కృష్ణమోహన్, గౌరవ సలహాదారుగా కె.శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా వై.లోకనాథ్ శర్మ నియమితులయ్యారు. అనంతరం వారు ఎమ్మెల్యే మల్లాది విష్ణును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

## సంతలో అన్నదానం


చంద్రగిరి సంతలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**చంద్రగిరి(తిరుపతి రూరల్):** పేదలను ఆదుకోవడంలోనూ, నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడంలోనూ చెవిరెడ్డి కుటుంబానికి సాటి ఎవ్వరూ లేరని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్‌రెడ్డి కొనియాడారు. చంద్రగిరి సంతలో ఆదివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కొట్టాల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వారపు సంతల్లో వ్యాపారం చేసుకునే వారిని ఆదుకునేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి తన సొంత నిధులు వెచ్చించి రుసుము కట్టే బాధ లేకుండా చేశారని తెలిపారు. సంతకు వచ్చే రైతులు, ప్రజలకు అన్నదానం చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో చంద్రగిరి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, నవీన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# టీచర్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

**తిరుపతి ఎడ్యుకేషన్:** 2008 డీఎస్సీ ద్వారా మినిమమ్ టైం స్కేల్ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి ప్రభుత్వాన్ని కోరారు. తిరుపతిలోని టీపీపీఎం హైస్కూల్లో ఆదివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన విద్యా సదస్సులో వారు మాట్లాడారు. గతంలో వివిధ రకాల పేర్లతో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టారని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల పోరాటాల ఫలితంగా పూర్తిస్థాయిలో రెగ్యులర్ ప్రాతిపదికన ఉపాధ్యాయులను నియమించారని గుర్తు చేశారు. ఇప్పుడు ఎంటీఎస్ పేరుతో 2008, 1998 డీఎస్సీ ఉపాధ్యాయులను నియమించడం సరైనది కాదని పేర్కొన్నారు. వారిని రెగ్యులర్ ఉపాధ్యాయులుగా నియమిస్తూ సర్వీస్ రిజిస్టర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జీఓ 117ను రద్దు చేసి రాష్ట్ర వ్యాప్తంగా జూన్‌లో హేతుబద్ధీకరణ ద్వారా బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని కోరారు. పాఠశాలల విలీనాన్ని ఆపివేసి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు చెంగల్రాయ మండడి, వెంకటముని, కిరణ్, నరేంద్ర, రమేష్, మునిరామిరెడ్డి, సురేష్, రవీంద్ర, కన్నప్ప పాల్గొన్నారు.

## సాంకేతికతతో వ్యవసాయం లాభదాయకం

**రేణిగుంట:** ఆధునిక సాంకేతిక వినియోగం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చవచ్చని చిత్తూరు ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ రత్నప్రసాద్ అన్నారు. మండలంలోని కరకంబాడి పంచాయతీ వనస్థలిలో ఆదివారం ఐసీఏఆర్ 95వ వ్యవస్థాపక దినోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు రైతులకు విజ్ఞానాన్ని అందించే ఈ కార్యక్రమ ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు యాంత్రికీకరణ, నూతన సాంకేతికతకు అనుగుణంగా పురోభివృద్ధి చెందుతోందన్నారు. వ్యవసాయంలో డ్రోన్ సాంకేతికత, డ్రమ్ సీడర్ పద్ధతిలో నేరుగా వరివిత్తనం నాటే విధానం గురించి వివరించారు. సేంద్రియ వ్యవసాయ ప్రాముఖ్యతను తెలియజేశారు. రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందుతున్న సేవలను ప్రశంసించారు. భూసార పరీక్షలు, వానపాము ఎరువుల తయారీ, వర్షపు నీటి నిల్వ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, మేఘదూత్ మొబైల్ అప్లికేషన్ల గురించి వివరించారు. అనంతరం ప్రదర్శన క్షేత్రాల నిమిత్తం రైతులకు ఇన్‌పుట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త కృష్ణారెడ్డి, ప్రతిమ, ఉద్యాన అధికారి పుష్పలత, డాట్ సెంటర్ సమన్వయకర్త రెడ్డిరాము, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీలత, పద్మజ, సుధాకర్, దివ్య, రాముకుమార్, అనూష తదితరుల పాల్గొన్నారు.

# వేడుకగా మహాకుంభాభిషేకం


కలశ తీర్థాలను తీసుకెళుతున్న అర్చకులు

**తొట్టంబేడు(శ్రీకాళహస్తి):** తొట్టంబేడు మండలం నెల్లిమానుకండ్రిగలో నిర్మించిన శ్రీచండికా పరమేశ్వరి సమేత శ్రీచక్రేశ్వరస్వామి ఆలయ మహాకుంభాభిషేకం ఆదివారం వేదోక్తంగా నిర్వహించారు. శ్రీచండికాంబిక పీఠం ట్రస్టు వ్యవస్థాపకులు సింగరాజు ప్రకాశం దంపతుల ఆధ్వర్యంలో సింగరాజ మణికంగ శర్మ సారథ్యంలో వేదపండితులు మహాకుంభాభిషేకం పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ ప్రధాన కలశాలను ఊరేగింపుగా ఆలయ శిఖరంపైకి తీసుకెళ్లి కలశాభిషేకం చేశారు. అనంతరం ఆలయంలో విశేష పూజలు చేశారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆర్డీఓ రామారావు, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ప్రముఖులు స్వర్ణమూర్తి, కోళ్లూరు హరినాథ్‌నాయుడు, సురేష్‌బాబు, రాము గుప్తా, మురళిగుప్తా, భూలక్ష్మమ్మ, బాలగౌడ్ పాల్గొన్నారు.